పడమటికేశ్వాపూర్ పాఠశాలను సందర్శించిన రాష్ట్ర ఎస్‌సీఈఆర్‌టీ బృందం

పాఠశాలలను సందర్శించిన అధికారుల బృందం

బచ్చన్నపేట, డిసెంబర్ 16 : మండలంలోని పడమటికేశ్వాపూర్ ఉన్నత పాఠశాలను శనివారం ఎస్‌సీఈఆర్‌టీ రాష్ట్ర కోఆర్డినేటర్ మంగతాయారు సందర్శించారు. ఉన్నతి, ఫండమెంటల్ లర్నింగ్ న్యూమరసీ మీద విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులకు ఆమె పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలక బృందం సభ్యులు రమేశ్, కొమురయ్య, మండల నోడల్ అధికారి మూర్తి, హెచ్‌ఎం చలపతిరెడ్డి, రజిత, జ్యోతి, శ్రీలత, నవీన్, పరశురాములు, కనుకయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

తమ్మడపల్లిలో మాట్లాడుతున్న డీఏవో వినోద్‌కుమార్

'పథకాలపై అవగాహన కలిగి ఉండాలి'

బచ్చన్నపేట, డిసెంబర్ 16 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జనగామ వ్యవసాయాధికారి వినోద్ కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని తమ్మడపల్లిలో వికాసభారత్ సంకల్ప యాత్రలో భాగంగా ప్రజలకు పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మేకల కవిత, డీఈవో రాము, ఎంపీడీవో రఘురామకృష్ణ, ఏపీఎం నాగేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా భాస్కర్

లింగాలఘనపురం, డిసెంబర్ 16 : లింగాలఘనపురం మండల టీఎస్ యూటీఎఫ్ అధ్యక్షుడిగా పొట్టబత్తిని భాస్కర్ (కుందారం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జనగామలో శనివారం టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టీ చంద్రశేఖర్‌రావు, ఆకుల శ్రీనివాస్‌రావు సమక్షంలో ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా ఇంద్రసేనారెడ్డి (నెల్లుట్ల). మాధవి (నేలపోగుల), ప్రధాన కార్యదర్శిగా జీ కృష్ణ (చిక్కులోనిగూడెం), కోశాధికారిగా టీ నవీన్(కుందారం), ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా పీ మర్రెడ్డి, కార్యదర్శులుగా లక్ష్మణ్ గౌడ్, సైదులు, పద్మజ, పూర్ణిమ, ఎలిజెబిత్ రాణి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ సంఘ నిర్మాణానికి, పటిష్టానికి పాటుపడుతూ అదే సమయంలో ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వానికి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

వరి కొయ్యకు నిప్పు.. భూసారానికి ముప్పు..

- వరి గడ్డిని పొలంలోనే తగులబెడుతున్న రైతులు
- నశిస్తున్న మిత్ర పురుగులు, సూక్ష్మజీవులు
- భూసారం పెరిగేందుకు పొలంలోనే కలియ దున్నాలి..
- వ్యవసాయ అధికారి దీప్తి..

రేగడితండాలో వరి కొయ్యలకు నిప్పు పెట్టిన రైతులు

జఫర్‌గఢ్, డిసెంబర్ 16 : రైతులు తెలిసో తెలియకనో చేస్తున్న పొరపాట్ల వల్ల భూసారం దెబ్బతింటోంది. గతంలో వరి కోతలు ముగియగానే రైతులు తమ పశువుల మేత కోసం వరిగడ్డిని వాములుగా పెట్టుకునే వారు. ఇప్పుడు వ్యవసాయం అంతా యంత్రాలపైనే ఆధారపడింది. దీంతో చాలామంది రైతులు వరిగడ్డిని వాములుగా వేయకుండా తమ పొలాల్లోనే తగులబెడుతున్నారు. ఇది ఎంతమాత్రం మంచిది కాదంటున్నారు వ్యవసాయ అధికారులు. ప్రస్తుతం వానాకాలం వరి కోతలు ముగిసి యాసంగి పనులు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో కొందరు రైతులు తమతమ పొలాల్లోని వరిగడ్డిని వాములుగా పేర్చుకోగా, మరికొందరు పొలాల్లోనే వదిలేశారు. వరి కొయ్యలతో పాటు గడ్డిని కూడా పొలంలోనే కాలుస్తున్నారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల పొలంలోని మిత్ర పురుగులు, సూక్ష్మజీవులు చనిపోయే అవకాశాలున్నాయి.

అలా కాకుండా రైతులు పొలంలో వరి కొయ్యలను, గడ్డిని కలియ దున్నడం వల్ల భూసారం పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి దీప్తి తెలిపారు. వరి కొయ్యలు, గడ్డిని పొలంలో కాల్చడంతో రైతులకు మేలు కన్నా, నష్టం ఎక్కువగా జరిగే అవకాశాలున్నాయని ఆమె తెలిపారు. గడ్డిని పొలంలో కాల్చడం వల్ల నేలకు మేలు చేసే క్రిమికీటకాలు నశించడమే కాకుండా, భూసారం తగ్గుతుందన్నారు. అంతేకాకుండా వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని తెలిపారు. నత్రజని, పాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం భూమిలో తగ్గుతుందన్నారు. భూమికి పీచు పదార్థాలుగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయన్నారు.

కలియ దున్నితే ఎన్నో ప్రయోజనాలు..

వరి కొయ్యలు, గడ్డిని పొలంలో కలియ దున్నితే ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని వ్యవసాయాధికారి దీప్తి తెలిపారు. వరి కొయ్యలను నేలలో కలియ దున్నితే సేంద్రియ కర్బన శాతం పెరిగి పంట దిగుబడులు 5నుంచి 10శాతం పెరిగే అవకాశం ఉందన్నారు. దుక్కిదున్నే సమయంలో సూపర్ పాస్పెట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలు అందుబాటులోకి వస్తాయని ఆమె తెలిపారు. వరి కొయ్యలను కలిపి దుక్కిలో దున్నడంతో డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుందన్నారు. నత్రజని, రెండు శాతం, పాస్పరస్ నాలుగు శాతం అదనంగా మొక్కలకు అందుతుందన్నారు. జింక్, మాంగనీస్, ఇనుము, కాల్షియం లాంటి సూక్ష్మధాతువులు పంటలకు మేలు చేకూరుస్తాయన్నారు.

వ్యవసాయానికి చేటు..

వరి కొయ్యలను, గడ్డిని పొలంలో కాల్చడం వల్ల వ్యవసాయానికి చేటు జరుగుతుంది. ఒకసారి వరి కొయ్యలను పొలంలో కాల్చితే వ్యవసాయం సుమారు 20యేండ్ల వరకు వెనుకబడినట్లే. కొయ్యకాళ్లను రెండు బస్తాల సూపర్ పాస్పెట్ వేసి రోటవేటర్‌తో దున్నితే భూమి సారవంతంగా మారుతుంది. భూసారం పెరిగి పంటల దిగుబడి పెరుగుతుంది.

- ఏవో దీప్తి

ఉద్యమకారుడు సంపత్‌రెడ్డిని మరువం

సంతాప సభలో అధికారులు, ప్రజాప్రతినిధులు

నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

జనగామ రూరల్, డిసెంబర్ 16 : ఉద్యమకారుడు, నిత్యం పేద ప్రజలతో ఉండే జనగామ జిల్లా జడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డిని ఈగడ్డ మరవదని ఎంపీపీ మేకల కళింగరాజు అన్నారు. శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సంపత్‌రెడ్డి సంతాప సభను ఏర్పాటు చేయగా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించి మౌనం పాటించారు. ఈ సందర్భంగా కళింగరాజు మాట్లాడుతూ అందరిని కలుపుకొని ముందుకు సాగిన సంపతన్న మన మధ్య లేకపోవడం చాలా బాధాకరమన్నారు. ఇలాంటి నాయకుడిని జనగామ ప్రాంతం కోల్పోవడం, ఆ లోటు తీర్చలేని దన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో హసీం, జడ్పీటీసీ నిమ్మతి దీపిక, మండల సర్పంచులు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు బొల్లం శారద, బండ లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు మూల రవి, పద్మ, శాలమ్మ, ముక్క రాజయ్య, బానోత్ జయరాం, కృష్ణారెడ్డి, అధికారులు మాధవరెడ్డి, భిక్షపతి, శ్రీనివాస్, రాజు, నాయకులు వెంకటేశం, బాలస్వామి, శ్రీనివాస్, స్వామి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వీవర్స్‌కాలనీలో రక్తదాన శిబిరం

జనగామ, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : జనగామ పట్టణంలోని వీవర్స్‌కాలనీ అయ్యప్ప స్వాములు, లయన్స్‌క్లబ్ ఆఫ్ మిలీనియం అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, కోడం శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం షుగర్ వ్యాధి నిర్ధారణ, రక్తదాన శిబిరం నిర్వహించారు. పూర్వ రీజియన్ చైర్మన్ ఏనుగు నర్సిరెడ్డి మాట్లాడుతూ రక్తదానం వల్ల ఖర్చు ఉండక పోగా ఒక జీవితాన్ని కాపాడుతుందన్నారు. 55మందికి షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, 20యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో పూర్వ రీజియన్ చైర్మన్ శ్రీరాంశ్రీనివాస్, రక్త దాతలు కామిని సమ్మయ్య, రచ్చ సత్యనారాయణ, వంగ యుగేందర్, బొంతపల్లి వెంకటేశ్, రచ్చ శ్రీనివాస్, మచ్చ కుమార్, ఉమేశ్, బ్లడ్ బ్యాంకు నిర్వాహకుడు రత్నం పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఉపాధి చూపాలి

ఆటో డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుమార్

మాట్లాడుతున్న జేరిపోతుల కుమార్

జనగామ, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలో భాగంగా మహిళలకు అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం వల్ల రోడ్డున పడ్డ ఆటో డ్రైవర్లకు ఉపాధి చూపించాలని ఆటో డ్రైవర్స్ యూనియన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జేరిపోతుల కుమార్ డిమాండ్ చేశారు. శనివారం జనగామలో యూనియన్ పట్టణ అధ్యక్షుడు బాల్దె శ్రీశైలం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల ఆటో కార్మికులకు జరుగుతున్న కష్టనష్టాలను సీఎం రేవంత్‌రెడ్డి పరిగణలోకి తీసుకోవాలని అన్నారు. రోడ్డున పడ్డ ఆటో డ్రైవర్లకు ఉపాధి చూపించాలన్న ప్రధాన డిమాండ్‌తో ఈనెల 18న సోమవారం జిల్లా కేంద్రంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టి ప్రజావాణిలో వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. జిల్లాలోని ఆటో డ్రైవర్లు ఆటోలతో సహా రావాలని కోరారు. సమావేశంలో లింగాలఘనపురం మండలం అధ్యక్షుడు నల్ల మల్లయ్య, పట్టణ ఉపాధ్యక్షులు ఎండీ అంజాద్, పట్టణ కార్యదర్శి ఫయాజ్, నిమ్మ రాకేశ్, సోమయ్య పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ

పాలకుర్తి, డిసెంబర్ 16 : మండల కేంద్రంలోని పాటిమీద కొలువుదీరిన క్షేత్రపాలకుడు భక్త ఆంజనేయస్వామికి శనివారం ఆకుపూజ పర్వాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచామృత అభిషేకం, చందన, తమలపాకుల పుష్పాలంకరణ నిర్వహించారు. భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు.

నర్సరీల్లో ఇప్పటి నుంచే మొక్కలు పెంచాలి

- ఎంపీడీవో ఉమామహేశ్వర్
- పలు గ్రామాల్లో నర్సరీల పరిశీలన

రామరాజుపల్లిలో ప్రైమరీ బెడ్స్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో

దేవరుప్పుల, డిసెంబర్ 16 : గ్రామాల్లో ఉన్న వన నర్సరీల్లో వచ్చే హరితహారంలో నాటేందుకుగాను ఇప్పటి నుంచే నారు పోయడం, మొక్కలను పెంచడం లాంటి చర్యలు చేపట్టాలని ఎంపీడీవో ఉమామహేశ్వర్ సంబంధిత ఉద్యోగులకు సూచించారు. మండలంలోని రామరాజుపల్లి, నీర్మాల, సింగరాజుపల్లి గ్రామాల్లో శనివారం పర్యటించిన ఆయన గ్రామాల్లో నర్సరీలను పరిశీలించి తగు సూచనలు చేశారు. కాగా ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పనులకు పరిశీలించి కూలీలకు పనులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ పనులు నడుస్తున్న నేపథ్యంలో సాధ్యమైనంత మంది ఎక్కువ కూలీలను తీసుకొచ్చే బాధ్యతను పంచాయతీ కార్యదర్శులు తీసుకోవాలన్నారు. కూలీ రేటు రూ. 278 ఉండగా అందుకు తగ్గ పనులను చేపట్టాలన్నారు. రైతుల భూములు చదును చేయడం, ట్రీకటింగ్ లాంటి పనులు చేయించుకోవచ్చన్నారు. ఇక నర్సరీల్లో గతంలో మొక్కలను పెద్ద బ్యాగులకు మార్చాలని, గింజతో బొలిచే మొక్కలకు ప్రైమరీ బెడ్స్ ఏర్పాటు చేసి గింజలను చల్లి మొలిచేలా జాగ్రత్తలు తీసుకోవాలని వన సంరక్షకులను కోరారు. వచ్చే జూన్ కల్లా మొక్కలు ఏపుగా పెరిగితేనే హరితహారంలో నాటేందుకు అనువుగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాస్, ఈనీ యాదగిరి, టీఏ సంపత్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు భాగ్యరాజ్, మధు, కృష్ణ. ఎఫ్‌ఏ నర్సింహులు తదితరులు ఉన్నారు.

ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

శంకర్‌ను సన్మానిస్తున్న డీడబ్ల్యూవో జయంతి

జనగామ, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం శనివారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లి దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు గజ్జి శంకర్‌ను జిల్లా అదనపు కలెక్టర్ సుహాసినితో కలిసి జిల్లా సంక్షేమ అధికారిణి జయంతి తదితరులు సన్మానించారు.